# సాక్షి బాపట్ల

శుక్రవారం । 7 । జూన్ । 2024






## బీసీజీ టీకాలు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యాన పలు గ్రామాల్లో గురువారం బీసీజీ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. డాక్టర్ ఫరీనా బేగం మాట్లాడారు.



## జాతీయ పోటీలకు అజయ్

తిరువూరు: పంజాబ్‌లో ఈ నెల 16 నుంచి జరిగే జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి కుంభా అజయ్ ఎంపికయ్యారు.

## అమావాస్య పూజలు



ఫిరంగిపురం: నుదురుపాడు గ్రామంలోని విశాలాక్షి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామికి వైశాఖ బహుళ అమావాస్యను పురస్కరించుకొని గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేసి పుష్పాలతో అలంకరించారు.

## న్యూస్‌రీల్

### ఆర్‌బీకే శిలాఫలకం ధ్వంసం



బల్లికురవ: మండలంలోని కొప్పరపాలెం గ్రామంలోని రైతు భవనం ముందున్న నవరత్నాలు, జగనన్న ఫొటోతో ఉన్న శిలాఫలకాన్ని అల్లరి మూకలు ధ్వంసం చేశాయి. ఈ విషయాన్ని సర్పంచ్, మండల ఉపాధ్యక్షురాలు, మాజీ సర్పంచ్‌లు, స్థల దాతలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో సంతమాగులూరు సీఐ కె.నరసింహారావు ఆదేశాలతో గ్రామంలో రెండు రోజులుగా పికెట్ కొనసాగిస్తున్నారు. ఆర్‌బీకెతోపాటు సచివాల యం ముందున్న శిలాఫలకాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నించగా తామంతా అడ్డుకున్నామని సర్పంచ్ వీ అమలా అంజిరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు కె.ఆదెమ్మ, మాజీ సర్పంచ్‌లు ప్రత్తిపాటి అక్కయ్య మేకల అంజిరెడ్డి, స్థల దాతలు పెద్దిరెడ్డి అంజిరెడ్డి, కోటిరెడ్డి, యక్కం అంజిరెడ్డి, మాగులూరి శివారెడ్డి అన్నారు. గ్రామాభివృద్ధికి బాటలు వేసుకోవాలే తప్ప శిలాఫలకం ధ్వంసం చేయడం ఏంటని ప్రశ్నించారు.

### 17 మందిపై పరస్పర కేసులు

బల్లికురవ: సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్ పూర్తి అయిన తదుపరి విజయోత్సవ సంబరాల్లో భాగంగా టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు సంబంధించి 17 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రవిశంకర్‌రెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని వైదన గ్రామంలో మంగళవారం రాత్రి టీడీపీకి చెందిన కూలీ విజయస్వామి సంబరాల్లో భాగంగా వైఎస్సార్ సీపీకి చెందిన బొమ్మిశెట్టి బ్రహ్మయ్య మధ్య మాటామాటా పెరగటంతో ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు గాయాల పాలవగా ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు చికిత్సకు వెళ్లారు. చికిత్స పొందుతూ ఫిర్యాదులు చేశారు. బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు కూలీ విజయస్వామి మరో 10 మందిపై, విజయస్వామి ఫిర్యాదు మేరకు బ్రహ్మయ్య మరో ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే ఎంతటివారిపైనైనా కేసులు నమోదుతో రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

### బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషిచేయాలి



చీరాల రూరల్: బాల కార్మికులను పనుల్లో పెట్టుకుని వెట్టి చాకిరి చేయించరాదని, బాల కార్మిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అసిస్టెంట్ కార్మిక శాఖాధికారి రామకృష్ణ పేర్కొన్నారు. కార్మికశాఖ, షాడోస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం చైల్డ్ లేబర్‌పై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు బాల కార్మికులను గుర్తించేందుకు చీరాల, వేటపాలెం ప్రాంతాల్లోని పలు మెకానిక్ షెడ్లు, జీడి బట్టీల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కార్మిక శాఖాధికారులు చీరాల, బాపట్ల ఏఎల్‌వోలు రామకృష్ణ, అబ్రహాంలు మాట్లాడారు. షాడోస్ సంస్థ ప్రతినిధి, న్యాయవాది రాజా సాల్మన్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖరరావు, ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ రాము, సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ విజయ్ ఆనంద్, షాడోస్ సిబ్బంది భాగ్యలక్ష్మి, అలేఖ్య, జహీదా పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించాలి



బాపట్లటౌన్: విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించే దిశగా జిల్లా రిసోర్స్‌పర్సన్లు కృషిచేయాలని జిల్లా ఇన్‌చార్జి డీఈవో వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించే అంశంపై రెండురోజులపాటు జరిగే శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల వసతులు అందుబాటులో ఉన్నాయని, ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్లు విద్యార్థులకు సులభమైన రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.వి.సుధాకర్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను మండల స్థాయిలోని ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి విద్యా వ్యవస్థ మెరుగుపరిచేలా చూడాలన్నారు. ఏఎంఓ బిల్లా మోజస్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సుభాని పాల్గొన్నారు.

# ఖరీఫ్‌కు నీరుక్షణ తప్పదు



అడుగంటిన పులిచింతల

- ఈసారి సాగు ఆలస్యం
- డెడ్ స్టోరేజ్‌కి చేరిన నాగార్జునసాగర్
- పులిచింతల నిల్వ 0.4 టీఎంసీలే
- ఇన్‌ఫ్లోలు అసలు లేవు
- కృష్ణా పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురిస్తేనే నీళ్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఈసారి ఖరీఫ్ ఆలస్యం అయ్యేలా కనపడుతోంది. కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాలు పడకపోవడం, నాగార్జునసాగర్, పులిచింతల డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో ఖరీఫ్‌కు సాగు నీరు ఇవ్వడంలో ఆలస్యం చోటు చేసుకునే అవకాశం ఉంది. గత ఏడాది జూన్ తొమ్మిదికి డెల్టాకు సాగు నీరు ఇచ్చిన సంగతి తెలిసిందే. ముందస్తు ఖరీఫ్‌కు నీరు ఇవ్వడం ద్వారా నవంబర్ మొదటి వారానికి పంట రావడం వల్ల ఆ నెలలో వచ్చే తుఫాన్లు, అధిక వర్షాల నుంచి పంటను కాపాడే అవకాశం ఉంది. అయితే ఈసారి కృష్ణా పరీవాహక ప్రాంతంలో వర్షాలు కురవకపోవడం వల్ల నాగార్జునసాగర్ పూర్తిగా డెడ్ స్టోరేజికి వెళ్లిపోయింది. మరోవైపు పులిచింతలలో కేవలం 0.4 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. కనీసం నాలుగు టీఎంసీల నీరు డెడ్‌స్టోరేజి కన్నా ఎక్కువ ఉన్నప్పుడే సాగు నీరు ఇవ్వగలమని, ప్రస్తుతం ఉన్న నీటిలో తాగునీటికి కొంత మేర ఇచ్చే అవకాశం ఉన్నా సాగునీరుకి ఇవ్వలేమని అధికారులు చెబుతున్నారు.

ప్రకాశం బ్యారేజి తూర్పు, పశ్చిమ కాల్వల ద్వారా 13.06 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందిస్తున్నారు. 5.71 లక్షల ఎకరాల ఆయకట్టు కృష్ణా పశ్చిమ కాలువల ద్వారా గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలో సాగు జరుగుతోంది. ఇందులో గుంటూరు జిల్లాలో 1.84 లక్షల ఎకరాలకు, బాపట్ల జిల్లాలో 3.80 లక్షల ఎకారాలకు, ప్రకాశం జిల్లాలో 0.05 లక్షల ఎకరాలకు కృష్ణా పశ్చిమ కాల్వ ద్వారా, 27 వేల ఎకరాలకు గుంటూరు చానెల్ ద్వారా సాగు నీటిని అందిస్తారు. సెంట్రల్ వాటర్ కమీషన్ వారు కృష్ణాడెల్టా సాగు, తాగునీటి అవసరాల నిమిత్తం 1,155.40 టీఎంసీల నీటిని కేటాయించింది. ఇందులో 67.94 టీఎంసీల నీటిని కృష్ణా పశ్చిమ డెల్టాకు కేటాయించారు. గుంటూరు ఛానల్‌కు సాగు, తాగు నీటి అవసరాలకు నాలుగు టీఎంసీలను కేటాయించారు. గత సంవత్సరం జూన్ తొమ్మిదిన నీరు అందిస్తే అంతకు ముందు సంవత్సర జూలై ఆరున నీటిని విడుదల చేశారు. గ త ఏడాది ఇదే సమయానికి పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న 33.228 టీఎంసీలు ఉంటే ఇప్పుడు కేవలం 0.413 టీఎంసీలు మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాల కోసం ఎదురు చూడక తప్పదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లోలు లేవు. వర్షాలు పడి ఇన్‌ఫ్లోలు గణనీయంగా పెరిగితేనే నీటి విడుదల సాధ్యం అవుతుంది. ఈ నెలలో వర్షాలు పడితే వచ్చే నెలలో ఖరీఫ్‌కు నీరు ఇచ్చే అవకాశం ఉంది.

# ఎన్నికల ప్రక్రియ విజయవంతం

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- ఉద్యోగులు, మీడియాకు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల: ఉద్యోగుల సమష్టి కృషి, జిల్లా ప్రజలు అందించిన సహకారంతో బాపట్ల జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలసి జిల్లా కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఒక పార్లమెంటు, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియలను ఆటంకాలు లేకుండా సజావుగా, ప్రశాంతంగా నిర్వహించామన్నారు. మార్చి 16న ఎన్నికల షెడ్యూలు విడుదలవడంతో అప్పటి నుంచి జిల్లాలో కోడ్ అమలుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. నిబంధనలకనుగుణంగా 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ నిర్వహించామన్నారు. తరువాత ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి, సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ నిర్వహించమన్నారు. అనంతరం ప్రధాన ఘట్టమైన పోలింగ్‌ను మే 13న ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించమన్నారు. జిల్లాలో ఎక్కడా రీపోలింగ్ అవసరం లేకుండా విజయవంతంగా పోలింగ్ ప్రక్రియను పూర్తిచేశామన్నారు. చివరగా ఎన్నికల ప్రక్రియలో ముగింపు ఘట్టమైన కౌంటింగ్‌కు విస్తృత ఏర్పాట్లు చేసి విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఇందుకు సహకరించిన పోలీస్ యంత్రాంగానికి, ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రత్యేకంగా తమ వంతు సహాయ సహకారాలు అందించిన మీడియా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సంపూర్ణ సహకారంతో పోలీస్ శాఖలోని హోంగార్డు స్థాయి ఉద్యోగి నుంచి ఏఎస్‌పి వరకు అందరి సమష్టి కృషితో జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేశామన్నారు. సమావేశంలో డీఆర్వో సత్తిబాబు పాల్గొన్నారు.

# చీరాల ప్రజలకు అందుబాటులో ఉంటా..



పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల: సార్వత్రిక ఎన్నికలలో తన వెన్నంటే ఉండి తనకు పూర్తి మద్దతు తెలిపిన చీరాల ఓటర్లకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. గురువారం రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చీరాల నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని, భవిష్యత్‌లో జగన్ ఆదేశానుశారం పనిచేస్తానన్నారు. నియోజకవర్గంలో పార్టీ ఓటమికి గల కారణాలను విశ్లేషించారు.. నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. వారికి ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తానన్నారు. ప్రతి ఒక్కరిని కలుపుకుంటూ పోతూ వారికి వెన్నంటే ఉంటానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన కొండయ్యకు బాపట్ల ఎంపీగా గెలుపొందిన టి.కృష్ణప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు కొండ్రు బాబ్జి ఉన్నారు.

# వైఎస్సార్ సీపీ కమిటీ ఏర్పాటు

పార్టీ నేతలు, కార్యకర్తల్లో ధైర్యం నింపే దిశగా అడుగులు



పట్నంబజారు: రాష్ట్రంలో ఎన్నికల అనంతరం భయానక వాతావరణం ఏర్పడిన పరిస్థితులు, టీడీపీ దాడులతో అత్యంత దారుణమైన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తోడుగా నిలిచేందుకు పార్టీ నేతలతో పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కమిటీని ఏర్పాటుచేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా చెలరేగిపోతున్నాయి. ఎక్కడిక్కడ దాడులకు తెగబడుతున్నాయి. దౌర్జన్యాలకు దిగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలపై దాడులకు దిగుతూ అత్యంత పాశవికంగా ప్రవర్తిస్తున్నాయి. ఈ సమయంలో పార్టీ నేతలు, కార్యకర్తలకు తోడుగా నిలిచేందుకు పార్లమెంట్ నియోజకవర్గాలకు కమిటీలను వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసింది. ప్రతి కార్యకర్తకు, ప్రతి అక్కచెల్లెమ్మకు, ప్రతి అన్నదమ్ములకు సోషల్ మీడియా సైనికులు ఈ కమిటీలు తోడుగా నిల్వనున్నాయి. బాధిత కుటుంబాలను పరామర్శించడంతోపాటు, వారికి అన్ని విధాలుగా న్యాయపరంగా, వైద్య, ఆర్థిక సహాయం అందజేసేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సన్నద్ధమయ్యాయి. బాపట్ల జిల్లాకు సంబంధించి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు, ఎమ్మెల్సీలు డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పోతుల సునీత, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, వేమూరు నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్‌కుమార్, రేపల్లె నియోజకవర్గ అభ్యర్థి ఈవూరి గణేష్, పార్టీ పర్చూరు నియోజకవర్గ అభ్యర్థి యడం బాలాజీ, అద్దంకి నియోజవకర్గ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి, చీరాల నియోజకవర్గ అభ్యర్థి కరణం వెంకటేష్‌లను నియమించారు.

# స్టాఫ్‌నర్సుల భర్తీ స్టాప్



ఆర్డీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న స్టాఫ్‌నర్సులు

- అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తామని పిలిచి వెనక్కు పంపారు.
- గుంటూరు ఆర్డీ కార్యాలయం ఎదుట మూడుజిల్లాల అభ్యర్థుల ఆందోళన



ఆర్డీ కార్యాలయం వద్ద వేచి ఉన్న స్టాఫ్‌నర్సులు

గుంటూరు మెడికల్: స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఎంపికయ్యారని వాట్సాప్ ద్వారా మెసేజ్‌లు పంపి కార్యాలయానికి వచ్చిన తర్వాత సర్టిఫికెట్లు పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ మళ్లీ నిర్వహిస్తామని ఆర్డీ కార్యాలయ అధికారులు చెప్పడంపై గురువారం అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు చేసేది లేక ఉసూరుమంటూ వెనుదిరిగారు. వివరాల్లోకి వెళితే ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని పలు టీచింగ్ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో 97 కాంట్రాక్టు, స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేయాలంటూ ఉన్నతాధికారుల నుంచి గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంకు ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఆర్డీ కార్యాలయం అధికారులు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాలో నుంచి ప్రతిభ ఆధారంగా 97 మందిని కౌన్సెలింగ్‌కు హాజరు కావాలంటూ బుధవారం వాట్సాప్ ద్వారా సమాచారం అందజేశారు. గురువారం ఉదయం అభ్యర్థులు రాగానే వారి సర్టిఫికెట్లు పరిశీలించి సాయంత్రానికి నియామక ఉత్తర్వులు ఇస్తామని, వేచి ఉండాలని సూచించారు. కొందరి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యేసరికి ఉన్నతాధికారుల నుంచి ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వవద్దంటూ ఆదేశాలు వచ్చాయి. దీంతో అర్ధాంతరంగా కౌన్సెలింగ్‌ను నిలిపివేశారు. సర్టిఫికెట్లు పరిశీలించి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తామని వేచి ఉండాలని చెప్పిన అధికారులు, అకస్మాత్తుగా కౌన్సెలింగ్ నిలిపివేయడంతో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. తమకు ఉత్తర్వులు ఇస్తేనే ఇళ్లకు వెళతామంటూ కార్యాలయంలో వేచి ఉన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల కార్యాలయం నుంచి కౌన్సెలింగ్‌ను వాయిదా వేయాలని వచ్చిన ఉత్తర్వుల కాపీలు నోటీసు బోర్డులో అంటించడంతో అభ్యర్థుల ఆందోళన మరింత ఎక్కువైంది. పలుమార్లు ఆర్డీ కార్యాలయం అధికారులను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసి చివరకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ లేకుండానే ఇళ్లకు వెళ్లిపోయారు. గుంటూరుతోపాటు, విశాఖపట్నం, కడప ఆర్డీ కార్యాలయాల్లో కూడా కౌన్సెలింగ్ నిలిపివేశారు.

# రౌడీషీటర్ దారుణ హత్య



బాజీ మృతదేహం

గుంటూరు ఈస్ట్: రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. క్రోసూరుకు చెందిన షేక్ బాజీ (31) ఆరు నెలల క్రితం గుజ్జనగుండ్లలో ఓ వ్యక్తిని హత్య చేశాడు. మరో ఘటనలో ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేశాడు. బాజీ తరచూ గుంటూరులోని బంధువుల వద్దకు వస్తుంటాడు. ఈక్రమంలో మంగళవారం గుంటూరులోని బంధువుల పెదకర్మకు హాజరయ్యాడు. అనంతరం తన మిత్రుడు షేక్ జాకీర్‌తోపాటు, మరికొంత మందిని కలిశాడు. బుధవారం బాజీ, జాకీర్, మరో ఐదుగురు ఉద్యోగనగర్‌లోని ఓ ఖాళీ ప్రదేశంలో మద్యం తాగారు. బాజీ తరచూ జాకీర్‌ను మద్యం పోయించాలని వేధిస్తున్నాడు. పైగా మద్యం పోయించకపోతే నిన్ను, నీ భార్య పిల్లల్ని చంపేస్తానంటూ జాకీర్‌ను తరచూ బెదిరిస్తున్నాడు. ఇది మనస్సులో పెట్టుకున్న జాకీర్ పథకం బాజీ మద్యం మత్తులోకి జారుకోగానే కర్రలు, రాళ్లతో మిత్రులతో కలిసి దాడి చేశాడు. తీవ్రంగా కొట్టి చంపి పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించాం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మలేరియా తస్మాత్ జాగ్రత్త

- మలేరియా సోకితే ఓ పట్టాన వదలదు
- అశ్రద్ధ చేస్తే జ్వరంతో ప్రాణాలు పోయే ప్రమాదం
- జూన్ నెల మలేరియా నివారణ అవగాహన మాసం



కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ



గుంటూరు మెడికల్: మలేరియా జ్వరం.. ఈ పేరు చెబితేనే గ్రామాల్లో చాలా మంది ప్రజలు వణికిపోతారు. నెలల తరబడి జ్వరం పీడిస్తూ ఉండటమే కారణం. వ్యాధి సోకిదంటే ఒక పట్టాన తగ్గదు. కొన్ని సందర్భాల్లో మరణాలూ సంభవిస్తాయి. గత ఏడాది 21 మంది మలేరియా బారిన పడగా ఈ ఏడాది ఐదు నెలల్లో ముగ్గురు మలేరియా బారిన పడ్డారు. ఈ నేపథ్యంలో మలేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఏటా జూన్‌నెలను యాంటీ మలేరియా నెలగా ప్రకటించారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

### మలేరియా లక్షణాలు

మలేరియా వ్యాధి అనాఫిలిస్ అనే దోమకాటు వల్ల వస్తుంది. వర్షాకాలంలో దోమలు పెరిగే ప్రదేశాల్లో ఎక్కువ అవ్వటం వల్ల ఈ వ్యాధి వర్షాకాలంలో ఎక్కువగా ప్రభలుతుంది. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్ళునొప్పులు, మూత్రం మందగించటం, లివర్, కడుపులో నొప్పి, జ్వరం మూడు రోజులకొకసారి లేదా రెండురోజులకొకసారి లేదా రోజుమార్చి రోజు వస్తూ ఉండటం ఈ వ్యాధి లక్షణాలు.

### నిర్ధారణ

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ గంట వ్యవధిలోపు చేస్తారు. రక్తపు పూతలు సేకరించి వ్యాధి నిర్ధారణ జరిగితే క్లోరోక్విన్, ప్రైమాక్విన్ అనే మాత్రలను ఇస్తారు. ఇవి 14 రోజులు ఆపకుండా తప్పని సరిగా వాడాలి. ఈ మందులన్నీ కూడా ఉచితంగా అందిస్తారు. న్యూడ్రగ్‌పాలసీ 2012 ప్రకారం తప్పని సరిగా 14 రోజులు మందులు వాడాలి.

### జిల్లాలో నమోదైన కేసులు

జిల్లాలో మలేరియా జ్వరం 2022లో 24 మందికి, 2023లో 21 మందికి, 2024 మే 31 వరకు ముగ్గురికి సోకింది. ఈఏడాది గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెం, తాడికొండ మండలం లాం గ్రామం, గుంటూరు నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీల్లో కేసులు నమోదయ్యాయి.

### దోమలు పెరగకుండా జాగ్రత్తలు

ఇంటి పరిసరాలలో దోమలు పెరిగేందుకు ఆస్కారం లేకుండా మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. పరిసరాల పరిశుభ్రతతోపాటుగా వ్యక్తిగత పరిశుభ్రత కల్గి ఉండాలి. వారానికి ఒకసారి ఇంటిలో నీటి నిల్వలు లేకుండా డ్రైడే పాటించాలి. ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి చిప్పలు,కొబ్బరి బోండాలు, పాత టైర్లు, రోళ్ళలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. దోమలు ఇళ్ళలోకి రాకుండా నియంత్రించేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో కిటకీలు, తలుపులు మూసి ఉంచాలి. లెట్రిన్ పైపులకు పైన వస్త్రాన్ని కప్పి ఉంచాలి. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా దోమతెరలు వాడటం ద్వారా దోమకాటు బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

### ఖచ్చితమైన నిర్ధారణ చేయాలి....



సరైన వ్యాధి నిర్ధారణ, చికిత్స చేయని పక్షంలో నెలల తరబడి మలేరియా వ్యాధి పీడిస్తోంది. కొందరిలో సెరిబ్రల్ మలేరియా, వైవ్యాక్స్ మలేరియాలు కూడా వస్తాయి. ఈ వ్యాధులు సోకిన వారిలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోవటం, కామెర్లు పెరిగిపోవటం, నిమోనియా, ఫిట్స్, మూత్రపిండాలు చెడిపోవటం, స్పృహకోల్పోవటం జరుగుతుంది.

– డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి, జ్వరాల స్పెషలిస్ట్, గుంటూరు

### ప్రత్యేక కార్యక్రమాలు



జిల్లాలో మలేరియా నివారణ కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవగాహన కోసం ర్యాలీ నిర్వహిస్తున్నాం. మలేరియా కేసులు నమోదైన గ్రామాల్లో మలాథిన్‌ఫాగింగ్, పైరిత్రమ్ స్ప్రే, యాంటీ లార్వా చర్యలు తీసుకుంటున్నాం. జూన్ నుంచి మలేరియా, డెంగీ జ్వరాలు నమోదయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలు వ్యాధులపై అవగాహన కల్గి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– టి.ఎం.కె. సుబ్బరాయణం, జిల్లా మలేరియా అధికారి, గుంటూరు

### ఉచిత వైద్య సేవలు



జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఉచితంగా అందిస్తున్నారు. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి ఆస్పత్రుల్లో అడ్మిట్ చేసి ఉచిత వైద్యం అందిస్తున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముఖ్యంగా సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేసి అవగాహన కల్పిస్తున్నారు.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, గుంటూరు





సచివాలయంపై టీడీపీ జెండా

# వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

సంతమాగులూరు (అద్దంకి): మండలంలోని తంగేడుమల్లి గ్రామంలోని గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వైఎస్సార్ విగ్రహాన్ని, సచివాలయ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. గ్రామ సచివాలయంపై టీడీపీ జెండాను ఉంచారు. ఈ చర్య టీడీపీ వారి పనేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా ఎన్నికల అనంతరం పలు గ్రామాల్లో టీడీపీ వర్గాలు దుందుడుకుగా వ్యవహరించడంతోపాటు, వైఎస్సార్ సీపీ సానుభూతిపరుపై విరుచుకుపడుతున్నారని, శిలాఫలకాలు, విగ్రహాలు ధ్వంసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సంబంధిత వ్యవహారాలపై పోలీసు వర్గాలు దృష్టి సారించి నిందుతులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ధ్వంసం చేసిన రాజశేఖరరెడ్డి విగ్రహం

## క్లుప్తంగా

### వర్షంతో ప్రజలకు ఊరట

**రేపల్లె రూరల్:** గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రతతో తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజలకు బుధవారం రాత్రి కురిసిన వర్షం ఊరటనిచ్చింది. రాత్రి 10.45 గంటల నుంచి తెల్లవారు జాము వరకు కురిసిన వర్షంతో పట్టణంలో వేడి వాతావరణం చల్లబడింది. రేపల్లె పట్టణంలో 4.2 మిల్లీమీటర్లు, నిజాంపట్నం మండలంలో 8.2 మిల్లీమీటర్లు, నగరం మండలంలో 6.2 మిల్లీమీటర్లు, చెరుకుపల్లి మండలంలో 2.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

### అద్దంకిలో దొంగల హల్‌చల్
**ఒకేసారి మూడిళ్లలో చోరీలు**



**అద్దంకి రూరల్:** పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లోని మూడిళ్లలో బుధవారం రాత్రి దొంగలు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. అద్దంకిలోని కాకాని పాలెంలోని జాగర్లమూడి అనంతలక్ష్మి, ఆ వెనుక ఉన్న వై.వెంకటరామిరెడ్డి ఇళ్లలో బుధవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. అనంతలక్ష్మి, వెంకటరామిరెడ్డి కుటుంబాలు తీర్థయాత్రలకు వెళ్లడంతో ఇళ్లకు వేసి ఉన్న తాళాలు పగులగొట్టి బీరువాలోని బంగారం, నగదును అపహరించారు. గురువారం తెల్లవారుజామున ఇంటి తలుపులు తెరచి ఉండటంతో సమీపంలో ఉన్న బంధువులు పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ కృష్ణయ్య ఇంటి యజమానులకు ఫోన్‌చేసి దొంగతనానికి పాల్పడిన నగదు, బంగారం విలువ తెలుసుకున్నారు. అనంతలక్ష్మి ఇంట్లో 5 సవర్ల బంగారం, 20 వేలు నగదు, వెంకటరామిరెడ్డి ఇంటిలో 2 సవర్ల బంగారం, 25 వేలు నగదు పోయినట్లు గుర్తించారు. అదే విధంగా స్థానిక మున్సిపల్ ఆఫీస్ పక్క బజారులోని రిటైర్డు జడ్జి కుటుంబం ఇంటికి తాళాలు వేసి హైదారాబాద్ వెళ్లారు. బుధవారం రాత్రి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఈఘటనలో ఎంత సొమ్ము పాయింది తెలియరాలేదు. అద్దంకిలో ఇదే విధంగా తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి వరుస దొంగతనాలకు పాల్పడుతున్నా.. పోలీసులు చర్యలు తీసుకోవటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తున్నాం

- జంగమహేశ్వరపాడు ఘటనలో 21 మందిని అరెస్ట్ చేశాం
- ఏఎస్పీ హనుమంతరావు, డీఎస్పీ రామకృష్ణాచారి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

**దుర్గి:** ప్రజలు శాంతియుతంగా మెలగాలని, ఉద్వేగాలకు, ఘర్షణలకు తావులేకుండా శాంతిభద్రతలకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు అడిషినల్ ఎస్పీ హనుమంతరావు, డీఎస్పీ రామకృష్ణాచారిలు తెలిపారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని జంగమహేశ్వరపాడు గ్రామంలో బుధవారం వైఎస్సార్ సీపీ వర్గీయులకు చెందిన 15 ఇళ్లను ధ్వంసం చేసి, నాలుగిళ్లను పూర్తిగా నేల మట్టం చేసిన ఘటనను వివరిస్తూ, గతంలో రాజకీయ, వ్యక్తిగత కక్ష్యల నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంటున్నట్లు తెలిపారు. టీడీపీ విజయం సాధించిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీకి చెందిన పలు కుటుంబాలు ఊళ్లు వదిలివెళ్లిపోయారని, ఈ అదను చూసుకుని ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఘటనకు కారకులైన 21 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, ఎంతటి వారినైనా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వివరించారు. గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని ఇరు వర్గాల నేతలను శాంతియుతంగా జీవించాలని తెలిపినట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ నేతృత్వంలో ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా పూర్తిస్థాయిలో భద్రతా చర్యలను తీసుకుంటున్నామన్నారు. సీఐలు అశహరి శ్రీనివాసరావు, శివశంకర్, సుబ్బారావు, ఎస్‌ఐలు ఎస్.కోటయ్య, వివేకానంద తదితరులున్నారు.

## దూరవిద్య మూల్యాంకనం ప్రారంభం



మూల్యాంకన కేంద్రాన్ని సందర్శించి, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వర్లు

**నరసరావుపేట ఈస్ట్:** సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్య) పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి 11,452 జవాబు పత్రాలు మూల్యాంకన కేంద్రానికి వచ్చాయని తెలిపారు. తెలుగు 614, హిందీ 28, ఇంగ్లిష్ 162, ఫిజికల్ సైన్స్ 1,418, బయోలాజికల్ సైన్స్ 8,708, సోషల్ స్టడీస్ 342 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నట్లు వివరించారు. మూల్యాంకనం విధుల్లో ముగ్గురు ఏసీఓలు, 22మంది సీఈలు, 123మంది ఏఈలు, 42మంది చెక్కర్లను నియమించినట్లు తెలిపారు. జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.ఎం.ఏ.హుస్సేన్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి



**తెనాలిరూరల్:** ట్రాక్టర్ ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన తెనాలి చెంచుపేటలో గురువారం జరిగింది. సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళ రోడ్డు దాటుతుండగా ఓవర్‌బ్రిడ్జి వైపు నుంచి అంగలకుదురు వైపు ఎరువుల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో కింద పడింది. ట్రాక్టర్ టైరు ఆమె తలపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పసుపు రంగు చీర, లేత వంకాయ రంగు జాకెట్ ధరించి ఉంది. మృతురాలి వద్ద ఉన్న సంచిలో పాత వస్త్రాలు ఉన్నాయి. ఘటనాస్థలాన్ని త్రీ టౌన్ పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్లు సత్వర పరీక్షలు నిర్వహించాలి

**నరసరావుపేట:** ల్యాబ్ టెక్నీషియన్లు సత్వరంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి అంటు వ్యాధులు విజృంభించకుండా ప్రజలకు మేలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఆవరణలో ల్యాబ్ టెక్నీషియన్లు, మలేరియా కార్యాలయ సిబ్బందితో మానవహారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జూన్ మాసం నుంచి అంటువ్యాధులు ప్రభలే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. వ్యాధులు ముదరకుండా వెంటనే రక్తపరీక్షలు చేసి వ్యాధిని నిర్ధారించి ప్రజలకు మేలు చేయాలని కోరారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ బి.రవీంద్ర రత్నాకర్, ఏఎంఓ చుక్కా వెంకటేశ్వర్లు, ఎస్‌యూఓ కుంచాల శ్రీనివాసరావు, కొల్లిపర శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు అండగా ఉంటాం

**మాజీ ఎమ్మెల్యే కోన**



**బాపట్ల:** ''ప్రజలకు అండగా ఉంటాం.. ప్రజలు తాము వేసిన ఓట్లు ఏమైనట్లని ప్రశ్నిస్తున్నారు. సాంకేతికతతో నిరూపించలేక ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాం. 23 సీట్లు వచ్చిన చంద్రబాబు తిరిగి అధికారంలోకి రాగా 11 సీట్లు సాధించిన ప్రజాదరణ కలిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్ళీ అధికారంలోకి రావటం పెద్దకష్టమేమి కాదు'' అంటూ మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేసిన పార్టీ క్యాడర్‌కు, అధికారులకు మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేగా వేగేశన నరేంద్రవర్మరాజుకూ అభినందనలు తెలిపారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రజలకు అనునిత్యం అండగా ఉందని, పిల్లలకు చక్కటి చదువు, పౌష్టికాహారాన్ని అందించిందని, సేవలు, పథకాలను ముంగిళ్లలోకి తీసుకెళ్లిందని గుర్తుచేశారు. అభివృద్ధి, సంక్షేమాన్ని జోడు గుర్రాలపై స్వారీ చేయించిన ఘనత జగన్‌కే దక్కుతోందని వివరించారు. ఆచరణకు సాధ్యం కాని హామీలతో చంద్రబాబు ప్రజలను మభ్య పెట్టారని కోన విమర్శించారు. వైఎస్సార్ సీపీ హయాంలో బాపట్ల జిల్లాతోపాటు రూ.520కోట్లతో మెడికల్ కళాశాలను ఏర్పాటు, జాతీయరహదారిని నాలుగులేన్లుగా విస్తర్ణ, పట్టణంలో రోడ్ల విస్తరణ వంటి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. రాష్ట్రం మొత్తం సెంటు స్థలం ఇస్తే బాపట్లలో సెంటున్నర స్థలం ఇవ్వటంతో పాటు ఇళ్ల నిర్మాణానికీ పూర్తిగా సహకరించామని కోన చెప్పారు. బాపట్లను పర్యాటకంగా అభివృద్ధి చేశామని వెల్లడించారు. ఓడినా పార్టీ క్యాడర్ ప్రజాసేవలోనే ఉండాలని, కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమలు చేసే పథకాలు ప్రజలకు అందేలా పోరాడాలని సూచించారు.

# వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడు బాలాజీ నాయక్

**మార్టూరు:** అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మార్టూరులో గురువారం ఉదయం వెలుగు చూసింది. ఏఎస్సై మహబూబ్ బాషా వివరాల మేరకు.. స్థానిక సుగాలి తండాకు చెందిన ముడావత్ బాలాజీ నాయక్ (53) కూరగాయల మార్కెట్ నుంచి తండాకు వెళ్లే దారిలో డ్రెయినేజీ కాలువ పక్కన పడి ఉండటాన్ని గురువారం ఉదయం 10 గంటల సమయంలో గుర్తించి తండావాసులు పోలీసులకు సమాచారం అందించారు. బాలాజీ నాయక్ ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం తండా నుంచి ఆటోలో మార్కెట్ సెంటర్‌కు వచ్చిన బాలాజీ నాయక్ రాత్రికి ఇంటికి చేరలేదు. రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో ఉన్న బాలాజీని గమనించిన స్థానికులు అతని కుమారుడు గోపి నాయక్‌కు, పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసులు బాలాజీ నాయక్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెంది ఉన్నట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించిన అధికారులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలాజీ నాయక్ శరీరంపై అక్కడక్కడ గాయాలు ఉండటంతో మృతుడి కుమారుడు గోపి నాయక్ ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం రిపోర్ట్ వచ్చాక బాలాజీ నాయక్ మృతికి గల కారణాలు తెలియరానున్నట్లు సీఐ ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

# 'ఆటో' ఇటో అయితే..!





మండలంలోని వివిధ గ్రామాలకు పరిమితి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలు

**రెంటచింతల:** మండలంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంవలన ఎక్కువ మంది ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని మంచికల్లు, రెంటాల, మిట్టగుడిపాడు, పశర్లపాడు, జెట్టిపాలెం, గోలి, మల్లవరం, సత్రశాల తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్‌సౌకర్యం లేదు. దీంతో ఆయా గ్రామస్తులు తమ అవసరాల కోసం తప్పక ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ఈ ఆటోలను కూడ కొంత మంది మైనర్లు నడపడం వలన వారికి వయస్సు రీత్యా అత్యుత్సాహం ఎక్కువ కావడంతో అతివేగంతో వెళ్లడం వలన కూడ ప్రమాదాలు జరుగుతున్నాయి.

**ఆటో ప్రమాదాలే అధికం..**

రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ప్రమాదం జరిగిన ఎక్కువగా ఆటో ప్రమాదాలే ఉంటున్నాయి. ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించక పోవడంతో తప్పని పరిస్థితులలో ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి గ్రామాలకు సైతం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయడం.. ఆటోలో ప్రయాణికులను నియంత్రించడం వంటివి చేస్తే ప్రమాదాలను కొంతవరకైనా నివారించే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

## వెండి తెర వెలుగులు నింపిన నిర్మాత రామానాయుడు

**తెనాలి అర్బన్:** వెండి తెరకు వెలుగులు నింపిన మహా మనిషి సినీ నిర్మాత దగ్గుపాటి రామానాయుడు అని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా కొనియాడారు. తెనాలిలోని మా ఏపీ కార్యాలయంలో సినీ నిర్మాత డాక్టర్ దగ్గుపాటి రామానాయుడు జయంతిని గురువారం సాయంత్రం నిర్వహించారు. రామానాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ ప్రపంచ చలన చిత్ర చరిత్రలో ఐదు దశబ్దాలుగా సినీ పరిశ్రమకు ఎనలేని సేవలు చేసిన వ్యక్తి రామానాయుడు అని చెప్పారు. 15 భాషల్లో 155 సినిమాలను నిర్మించిన ఏకైక నిర్మాతని గుర్తు చేశారు. సురేష్ ప్రొడక్షన్ బ్యానర్‌పై 24 మంది కొత్త దర్శకులను, 12 మంది టాప్ హీరోయిన్‌లను ఆయన పరిచయం చేశారని చెప్పారు. రామానాయుడు సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2012లో పద్మభూషణ్ అవార్డు ఇచ్చిందన్నారు. అలాగే రఘుపతి వెంకయ్య, దాదా సాహెబ్ ఫాల్కే వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులు కూడా ఆయనకు దక్కయన్నారు. కార్యక్రమంలో నటి టీనా చౌదరి, మా ఏపీ సభ్యులు మిలటరీ ప్రసాద్, మన్నె సత్యనారాయణ, వెంకీ రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# 13 మంది అభ్యర్థుల డిపాజిట్ గల్లంతు

**సత్తెనపల్లి:** సార్వత్రిక ఎన్నికల్లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన 15 మంది అభ్యర్థుల్లో 13 మంది డిపాజిట్లను కోల్పోయారు. నియోజకవర్గంలో 2,42,047 మంది ఓటర్లకు 2,10,606 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్లు, సర్వీస్ ఓట్లు కలుపుకొని మొత్తం 2,13,305 ఓట్లు కాగా తిరస్కరించిన పోస్టల్ బ్యాలెట్లు 737 ఉన్నాయి. ఇవి పోను 2,12,568 ఓట్లు అభ్యర్థులకు వచ్చినట్లు అధికారులు తేల్చారు. డిపాజిట్ పొందాలంటే పోలైన ఓట్లలో ఆరు శాతం రావాల్సి ఉంది. మొత్తం 15 మంది పోటీ చేయగా 13 మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోగా.. మూడో స్థానంలో 1,140 ఓట్లతో నోటా నిలిచింది. కేవలం ప్రధాన పార్టీల అభ్యర్థులైన ఎన్డీఏ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి రాంబాబుకు మాత్రమే డిపాజిట్లు దక్కాయి.

**నియోజకవర్గంలో డిపాజిట్ కోల్పోయిన అభ్యర్థులు, ఓట్లు, శాతం ఇలా...**

| అభ్యర్థి పేరు | పార్టీ | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| చుక్కా చంద్రపాల్ | కాంగ్రెస్ | 1,580 | 0.74 |
| పేరుపోగు నవీన్‌బాబు | బీఎస్పీ | 647 | 0.30 |
| గోదా వెంకటరమణ | జాతీయ జనసేన పార్టీ | 119 | 0.06 |
| జొన్నలగడ్డ విజయ్‌కుమార్ | జైబీమ్‌రావు భారత్ పార్టీ | 170 | 0.08 |
| యామోజి హనుమంతురావు | యుగ తులసి పార్టీ | 107 | 0.05 |
| రంగిశెట్టి నాగేశ్వరరావు | పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా | 84 | 0.04 |
| షేక్ దరియావలి | జైభారత్ నేషనల్ పార్టీ | 47 | 0.02 |
| గద్దం రాంబాబు | ఇండిపెండెంట్ | 63 | 0.03 |
| పి.గోవింద రమేష్‌బాబు | ఇండిపెండెంట్ | 28 | 0.01 |
| జక్రియ కందుకూరి | ఇండిపెండెంట్ | 213 | 0.10 |
| పాడి మణికంఠ | ఇండిపెండెంట్ | 108 | 0.05 |
| మేకల వేణుమాధవరెడ్డి | ఇండిపెండెంట్ | 78 | 0.04 |
| మేకల సుబ్బారావు | ఇండిపెండెంట్ | 90 | 0.04 |
| నోటా | ----- | 1,140 | 0.54 |

# మెజార్టీలు తగ్గడంపై డీలా

- గ్రామ గ్రామాన కనిపిస్తున్న స్పష్టమైన అభివృద్ధి
- అన్నివర్గాలకు అందిన సంక్షేమ పథకాలు
- అవినీతి ఆరోపణలు లేని నంబూరు
- విస్మయానికి లోనవుతున్న పెదకూరపాడు ప్రజలు


**అచ్చంపేట:** ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీకి సానుకూలమైన పరిస్థితులు బాగా ఉన్నాయి. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు అందిన సంక్షేమ పథకాలు... నూతనంగా నిర్మించిన సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు, ఆధునికీకరించిన పాఠశాలలతో గ్రామాలలో స్పష్టంగా కనిపించిన అభివృద్ధి.. అవినీతి మరకలేని ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావుకు ప్రతిపక్షాల వారు సైతం ప్రశంసలు.. అభివృద్ధి పనులకు తన సొంత డబ్బే వెచ్చించారు తప్ప ఎక్కడా రూపాయి అవినీతికి పాల్పడిన దాఖలాలు లేనివైనం.. గత 5 సంవత్సరాలుగా తన సొంత వ్యాపారాన్ని సైతం దూరంపెట్టి శుభ కార్యాలకైనా.. అశుభ కార్యాలకైనా హాజరవుతూ నిత్యం ప్రజల మధ్యనే ఉంటున్న శంకరరావును కాదని, కేవలం ఎన్నికలకు 40 రోజులు ముందు వచ్చిన భాష్యం ప్రవీణ్‌ను ప్రజలు ఎలా ఆదరించారన్నది అంతుపట్టని ప్రశ్నగా మారింది. ఎవరూ చేయని విధంగా అమరావతి నుంచి బెల్లంకొండ వరకు రూ.150 కోట్లతో వేసిన ట్రిబుల్ రోడ్డు, మాదిపాడు వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి చేసిన కృషి.. ఇవేవి పనిచేయకపోవడంపై మండల ప్రజలు విస్మయానికి లోనవుతున్నారు. ఇలాంటి సానుకూల పరిస్థితులలో అచ్చంపేట మండలంలో 2019లో వైఎస్సార్ సీపీకి వచ్చిన మెజార్టీలు ఒక్కసారిగా పడిపోవడాన్ని ఇటు వైఎస్సార్ సీపీ శ్రేణులే కాకుండా అన్నివర్గాల వారు జీర్ణించుకోలేకపోతున్నారు. గ్రామాల వారీగా వైఎస్సార్ సీపీకి 2019లో వచ్చిన మెజార్టీలు, ఇప్పుడు పడిపోయిన మెజార్టీలను పరిశీలిస్తే ఇలా ఎలా సాధ్యం అనే సందేహం రాకమానదు..

**అచ్చంపేట మండలంలో వైఎస్సార్ సీపీకి వచ్చిన మెజార్టీలు**

| నం | గ్రామం | 2019లో... | 2024లో... |
|---|---|---|---|
| 1 | మాదిపాడు | 829 | 263 |
| 2 | చల్లగరిగ | 277 | 196 |
| 3 | తాడువాయి | 487 | 36 |
| 4 | చింతపల్లి | 332 | - 68 (మైనస్) |
| 5 | చెరుకుంపాలెం | 185 | - 284 |
| 6 | కొత్తపల్లి | - 4 | - 18 |
| 7 | తాళ్లచెరువు | 1,863 | 1,022 |
| 8 | చామర్రు | 164 | 86 |
| 9 | అచ్చంపేట | 1,805 | -165 |
| 10 | నీలేశ్వరపాలెం | 318 | 192 |
| 11 | చిగురుపాడు | - 32 | - 91 |
| 12 | చిగురుపాడు ఆర్‌ఆర్ సెంటర్ | 172 | 42 |
| 13 | కోగంటివారిపాలెం | 363 | 313 |
| 14 | అంబడిపూడి | 28 | - 38 |
| 15 | కోనూరు | 307 | - 270 |
| 16 | కస్తల | 515 | - 236 |
| 17 | ఓర్వకల్లు | 124 | - 58 |
| 18 | రుద్రవరం | - 77 | - 117 |
| 19 | గ్రంథశిరి | - 158 | - 520 |
| 20 | వేల్పూరు | - 700 | - 881 |
| 21 | పెదపాలెం | - 31 | 95 |
| 22 | పెదపాలెం ఆర్‌ఆర్ సెంటర్ | 101 | - 77 |
| 23 | మిట్టపాలెం | 93 | - 256 |
| 24 | కొండూరు | 408 | 37 |
| 25 | నిండుజర్ల | 218 | 86 |
| | మొత్తం | 7,297 | - 161 |

# ఆదివాసీలను అణచివేస్తున్న ప్రభుత్వాలు

- నేడు గుంటూరు సభను జయప్రదం చేయండి
- పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

**నరసరావుపేట:** ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో ఆదివాసుల హననాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో గుంటూరులో జరిగే సభను జయప్రదం చేయాలని ప్రజా సంఘాలు నాయకులు కోరారు. గురువారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడారు. దండకారణ్య ప్రాంతంలో జనవరి నుంచి నేటివరకు సుమారు 140 మంది ఆదివాసీలు, మావోయిస్టులను ఎదురు కాల్పుల పేరుతో కాల్చి చంపడం, మహిళలు, పసి పిల్లలపై హత్యాచారాలు, వైమానిక, డ్రోన్ దాడులు నిత్యకృత్యంగా జరుగుతున్నాయన్నారు. దండకారణ్యం రక్తం ఒలుకుతూ మరో గాజాలాగా తయారైందన్నారు. పాలకులు తమ స్వార్థం కోసం కార్పొరేట్ కంపెనీలతో అనేక ఒప్పందాలు చేసుకొని ఆదివాసీల ప్రాంతాల్లో మైనింగ్ కొల్లగొట్టడం కోసం ప్రయత్నిస్తున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా ఆదివాసులు పోరాడుతున్నారన్నారు. దేశభక్తి పేరుతో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు దేశ వనరులను దోచి పెడుతోందన్నారు. దండకారణంలో ఉన్న ప్రజలతోపాటు మూలవాసి ఆందోళన మచ్, ఇంకా అనేక హక్కుల సంఘాల నాయకులు అక్కడ జరిగే దారుణాలను వెలుగులోకి తెస్తున్నారని, బయట ప్రపంచం సరిగా స్పందించకనే నేడు ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆదివాసులపై దాడులకు నిరసనగా గురువారం ఉదయం 10 గంటలకు గుంటూరు బ్రాడీపేట 2/7లో కొరిటాల భవన్ (సీపీఎం కార్యాలయం)లో జరిగేసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిలో ఇటీవల ఛత్తీస్‌ఘడ్‌కు నిజనిర్ధారణకు వెళ్లిన బృందం సభ్యులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శిఖినం చిన్న పాల్గొన్నారు.